సాక్షి
వికారాబాద్
మంగళవారం । 25 । జూలై । 2023



పాత పంటలు కనుమరుగు

పాత పంటలే పరమౌషధాలు. సజ్జ, ఉలువ, సామలు ఇలాంటి ఆహారపు అలవాట్లను గురించి చెప్పనవసరం లేదు. 8లో▸



స్తంభించిన రవాణా

ఎడతెరిపి లేని వర్షాలతో పొంగిపొర్లుతున్న వాగులు, వంకలతో రవాణా పూర్తిగా స్తంభించి పోతోంది. 8లో▸



దిగజారుడు రాజకీయాలు

ఎమ్మెల్యే ఆనంద్ ఓటమి భయంతోనే కాంగ్రెస్ గడపలు తొక్కుతున్నారని ఆ పార్టీ నేత సుధాకర్ రెడ్డి ఆరోపించారు. 9లో▸

న్యూస్‌రీల్

గూడ్స్ ట్రాన్స్‌పోర్టు సమస్యల పరిష్కారానికి కృషి

జీసీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు శుభప్రద్ పటేల్



అసోసియేషన్ సభ్యులను సన్మానిస్తున్న శుభప్రద్ పటేల్

తాండూరు టౌన్: లారీ గూడ్స్ ట్రాన్స్‌పోర్టు సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని బీసీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. ఇటీవల తాండూరులో జరిగిన లారీ గూడ్స్ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన కార్యవర్గ సభ్యులను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ అధ్యక్షుడు వేంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు డాక్టర్ జాఫర్‌ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గూడ్స్ రవాణా రంగంలో ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వాహబ్, గోపాల్, యూసుఫ్, గఫార్, జహూర్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు సీజేకి శుభాకాంక్షలు



సీజేకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రజిత

తాండూరు టౌన్: తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాదేకు తాండూరు బార్ కౌన్సిల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ, న్యాయవాది ఎం రజిత శుభాకాంక్షలు తెలిపారు. హైకోర్టు సీజేగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

నిధుల మంజూరుపై హర్షం



మంత్రి నిరంజన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: పరిగి మార్కెట్ కమిటీ అభివృద్ధికి రూ.80లక్షలు మంజూరు కావడంతో సోమవారం ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ నగరంలో వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, గోపాల్ గౌడ్, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన ఎమ్మెల్యే ఆనంద్



అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: వికారాబాద్ పట్టణం రాజీవ్‌నగర్ సమీపంలోని కేజీబీవీ వసతి గృహాన్ని సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణ దశలో ఉన్న జూనియర్ కళాశాల బిల్డింగ్ పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తేవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో బోధన కోసం లెక్చరర్లుగా ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌శర్మ సూచించారు. తోల్‌కట్ట సమీపంలోని వికారాబాద్ డిగ్రీ మహిళా కళాశాలలో హిస్టరీ బోధన కోసం పార్ట్‌టైమ్ ప్రాతిపదికన పని చేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలని, ఈనెల 27వ తేదీ 4 గంటలలోపు డిగ్రీ కళాశాలలో బయోడేటా సమర్పించాలన్నారు. వివరాలకు 82470 68251 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

తీపి కబురు



మోమిన్‌పేటలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

జిల్లాలో 980మంది వీఆర్‌ఏలు

- ప్రస్తుతం విధుల్లో 812 మంది
- రెవెన్యూ శాఖలోనే క్రమబద్ధీకరిస్తూ జీఓ విడుదల
- కేటగిరీల వారీగా కసరత్తు చేస్తున్న అధికారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న వీఆర్‌ఏలు

వికారాబాద్: వీఆర్‌ఏలకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. వారిని రెవెన్యూ శాఖలోనే క్రమబద్ధీకరిస్తూనే.. విద్యార్హతలను బట్టి ఆయా శాఖల్లో భర్తీ చేయనుంది. సోమవారం ఇందుకు సంబంధించిన జీవోను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేయడమే అని కొందరు ఆరోపిస్తున్నారు.

కేటగిరీల వారీగా కసరత్తు

ప్రభుత్వం వీఆర్‌ఏలకు సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో అధికారులు కేటగిరీల వారీగా విభజించే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో మొత్తం 980 వీఆర్‌ఏలు ఉండగా 812 మంది విధుల్లో కొనసాగుతున్నారు. పదో తరగతి విద్యార్హత ఉన్న వారికి ఫోర్త్ క్లాస్ ఉద్యోగులుగా, ఇంటర్ విద్యార్హత గల వారిని రికార్డ్ అసిస్టెంట్లుగా, డిగ్రీ ఆపైన అర్హత కలిగిన వారిని జూనియర్ అసిస్టెంట్లుగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా 22 వేల వీఆర్‌ఏలు ఉండగా 1700 మందిని మాత్రమే రెవెన్యూ శాఖలో కొనసాగించేందుకు ఖాళీలు చూపించింది. ఈ లెక్కన సగటున ఒక్కో జిల్లాకు 50 నుంచి 60 మంది రెవెన్యూ శాఖలో కొనసాగే అవకాశం ఉంది.మిగతా వారిని నీటి పారుదల, ఇతర శాఖల్లో సర్దుబాటు చేయనున్నారు. ఇక 60 సంవత్సరాలు నిండిన వారి స్థానంలో వారి వారసులకు ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే 60 ఏళ్ల లోపు ఉండి పదో తరగతి లోపు విద్యార్హత కలిగిన వీఆర్‌ఏలను ఎక్కడ, ఏ శాఖలో, ఏ స్కేల్ ఇచ్చి కొనసాగిస్తారనే విషయంలో ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదు.

పెరగనున్న పని భారం

వీఆర్‌ఓల వ్యవస్థను రద్దు చేసింది మొదలు తహసీల్దార్ కార్యాలయాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, అధికారులపై పని భారం పెరిగింది. కులం, ఆదాయం, నివాసం లాంటి సర్టిఫికెట్లు, కల్యాణలక్ష్మి పథకం అమలు, భూ రికార్డుల నిర్వహణతో పాటు అధికారులకు క్షేత్రస్థాయిలో సహకరించడం, ఎన్నికల విధుల్లో పాల్గొనడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించే సమయంలో ప్రజలకు ప్రభుత్వాలకు సంధానకర్తలుగా ఉంటూ రెవెన్యూ వ్యవస్థకు వెన్నెముకలా సేవలందించే వారే. వీఆర్‌ఓల రద్దుతో ఆ భారమంతా ఆర్‌ఐలపై పడింది. మండలాల్లో ఉండే ఇద్దరు, లేక ఒక ఆర్‌ఐ ఆ పనులన్నీ చేయలేక నానా తంటాలు పడుతున్నారు. అధికారులు ఇందులో కొన్ని రకాల సేవలు వీఆర్‌ఏలతో చేయిస్తూ వచ్చారు. ప్రభుత్వం వీఆర్‌ఏ వ్యవస్థను కూడా రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో రెవెన్యూ అధికారులపై మరింత పని భారం పెరగనుంది

“నిర్వీర్యం చేయడమే



వీఆర్‌ఓ వ్యవస్థ రద్దుతో సగం, ప్రభుత్వ తాజా నిర్ణయంతో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం కానుంది. కుట్రలో భాగంగానే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తహసీల్దార్లు, ఆర్డీఓలకు అధికారాలు తొలగించారు. ఇది ప్రజలకు, సమాజానికే నష్టం చేకూరుస్తుంది.

– బాల్‌రాజ్, ఆర్‌ఐల సంఘం జిల్లా అధ్యక్షుడు

స్వాగతిస్తున్నాం



ప్రభుత్వ నిర్ణయాన్ని సంఘం తరపున స్వాగతిస్తున్నాం. కానీ ఇక ముందు కూడా తమను రెవెన్యూ వ్యవస్థలోనే కొనసాగించాలి. సర్దుబాటు సాకుతో ఇతర శాఖకు పంపాలని చూడడం సరికాదు. రిక్రూట్‌మెంట్ చేసే సమయంలో తమను రెవెన్యూ శాఖలోనే నియమించారు.

– ఓంప్రకాశ్, వీఆర్‌ఏల సంఘం నాయకుడు

సంక్షేమం, అభివృద్ధి ఆగొద్దు



సిద్దులూరు పీహెచ్‌సీలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

- అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ
- హరితహారాన్ని ప్రారంభించాలని ఆదేశం

వికారాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు పూర్తి స్థాయిలో అమలు కావాలని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాలు పడినందున హరితహారాన్ని ప్రారంభించాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చి పెద్ద మొక్కలను నాటాలన్నారు. క్రీడా ప్రాంగణాల హద్దుల చుట్టూ మొక్కలు నాటి ఫెన్సింగ్ వేయాలన్నారు. అనంతరం సిద్దులూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో మన ఊరు మన బడి పనులను పరిశీలించారు. పనుల వేగం పెంచాలని ఆదేశించారు. పాఠశాలలో డిజిటల్ తరగతి గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. రోడ్లపై ఉన్న గుంతల్లో వర్షపు నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కామారెడ్డిగూడ, పాతూర్ గ్రామాల్లో పర్యటించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(డీటీసీ) మురళీధర్, అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్, ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు పాల్గొన్నారు.

ఆగస్టు 21న ఓటరు జాబితా డ్రాఫ్ట్

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆగస్టు 21న ఓటరు జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్ విడుదల చేయనున్నట్లు వికారాబాద్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే సూచించాలన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 284 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 25మంది రూట్ ఆఫీసర్లు, 25 మంది సెక్టోరల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. కుటుంబంలోని అందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిబంధనలు పాటిస్తూ ఎన్నికలు సజావుగా, శాంతియుతంగా జరిగేలా రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. అర్హత ఉండి ఓటు హక్కు పొందని వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, డీటీ వీరేశం పాల్గొన్నారు.

24,352 మందికి.. అదనపు ఆసరా

- దివ్యాంగులకు రూ.4,016 పెన్షన్
- ఈనెల నుంచే రూ.వెయ్యి పెంపు అమలు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

వికారాబాద్ అర్బన్: దివ్యాంగులకు ప్రభుత్వం మరింత ఆసరా అందించింది. నిత్యజీవితంలో అందరిలా జీవన పోరాటం సాగించలేకపోతున్నామని, తమ బతుకులు భారంగా మారాయని, ఆసరా పెన్షన్‌ను పెంచాలని అనేకసార్లు ప్రభుత్వాన్ని కోరారు. వీరి విన్నపాలను దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్.. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా దివ్యాంగుల పింఛన్‌ను రూ.3,016 నుంచి రూ.4,016కు పెంచనున్నట్లు ప్రకటించారు. జూలై నెల నుంచి హామీ అమలవుతుందని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.వెయ్యి అదనంగా అందజేయాలని జీఓ విడుదల చేశారు. దీంతో జిల్లాలోని 24,352 మంది దివ్యాంగులకు అదనపు లబ్ధి చేకూరనుంది. గతంలోనూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహించింది. వీరికి అవసరమైన ఉపకరణాలతో పాటు, వాహనాలు, ల్యాప్‌టాప్‌లు వంటివి పంపిణీ చేసింది. ప్రభుత్వ జీఓతో జిల్లా వ్యాప్తంగా 19 మండలాల పరిధిలోని మొత్తం 24,352 మంది దివ్యాంగులు లబ్ధి పొందనున్నారు. వీరికి ప్రతి నెల రూ.7,34, 45,632 కోట్లు పంపిణీ చేస్తున్నారు. రూ.వెయ్యి పెంపకంతో అదనంగా మరో రూ.2,43,52,000 రానున్నాయి. సర్కారు చేయూతపై లబ్ధిదారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

“సంతోషకరం



దివ్యాంగుల పెన్షన్‌ను రూ.వెయ్యి పెంచడం సంతోషకరం. రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని చాలా రోజులుగా పోరాటం చేస్తున్నాం. సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం రూ.4,016కు పెంచడం కొంత ఊరట కలిగిస్తోంది. అలాగే ప్రతిఒక్కరికీ దళితబంధు ఇవ్వాలి. కార్పొరేషన్ రుణాల్లో ప్రాధాన్యం కల్పించాలి.

– నర్సింలు, దివ్యాంగుల సంఘం నేత

మండలం	లబ్ధిదారులు
దౌల్తాబాద్	1,648
కొడంగల్	1,581
వికారాబాద్ మున్సిపాలిటీ	1,558
దోమ	1,519
పరిగి	1,420
తాండూరు	1,419
కుల్కచర్ల	1,400
తాండూరు మున్సిపాలిటీ	1,328
బషీరాబాద్	1,280
యాలాల	1,274
బొంరాస్‌పేట్	1,261
పూడూర్	1,179
నవాబుపేట్	1,163
మర్పల్లి	1,153
పెద్దేముల్	1,136
మోమిన్‌పేట్	1,096
ధారూరు	1,041
వికారాబాద్	763
కోట్‌పల్లి	607
బంట్వారం	526

సౌకర్యాల కల్పనలో విఫలం



పరిగి డిగ్రీ కళాశాలలో సౌకర్యాలను పరిశీలిస్తున్న లాల్‌కృష్ణ తదితరులు

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ

పరిగి: పట్టణంలోని డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ ఆరోపించారు. సోమవారం పరిగిలోని తుంకలగడ్డలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. మూడేళ్ల క్రితం ఇక్కడ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసినా ఇప్పటి వరకు సౌకర్యాలు కల్పించలేదని ఆరోపించారు. దీంతో విద్యార్థులు కళాశాలలో చేరడం లేదన్నారు. సీఎం కేసీఆర్ మాయ మాటలతో ఇటు విద్యార్థులను, అటు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. కళాశాలకు సొంత భవనం లేదని, అధ్యాపకులు లేక పాఠాలు సరిగ్గా జరగడం లేదని పేర్కొన్నారు. విద్యార్థులకు మరుగుదొడ్లు లేని దుర్భర పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో విద్యావ్యవస్థ పూర్తిగా దెబ్బతింటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే కళాశాలల్లో సౌకర్యాలు కల్పించాలని, లేదంటే పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లపై నివేదిక ఇవ్వండి

- విద్యార్థులకు అందుతున్న భోజనాన్ని పరిశీలించండి
- కలెక్టర్ నారాయణరెడ్డి
- నేటి నుంచే క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశం

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల వసతిగృహాల్లో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, భవన పరిస్థితులను పరిశీలించి వెంటనే నివేదిక సమర్పించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న భోజనం, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్య పనులను పరిశీలించాలని ఆదేశించారు. నేటి నుంచే క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. భవనాలను పరిశీలించి మరమ్మతులు చేయాల్సి వస్తే పంచాయతీరాజ్ ఏఈలతో సంప్రదించాలని ఆదేశించారు. మరమ్మతులకు వెంటనే నిధులు మంజూరు చేయాలన్నారు. అనంతరం అసెంబ్లీ ఎన్నికపై చర్చించారు. ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు నోడల్ అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. వీరికి అన్ని అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 221 దరఖాస్తులను ఆయా శాఖలకు బదిలీ చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సంచిత అగర్వాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నత్తను తలదన్నేలా..



పునాదుల స్థాయిలో జిల్లా పరిషత్ భవన నిర్మాణ పనులు

జెడ్పీ భవన నిర్మాణ పనులు

- ఏడాదిగా పునాదులకే పరిమితం
- అంచనా వ్యయం రూ. 10 కోట్లు, రూ. 5.15 కోట్లతో పనులు
- జనరల్ బాడీ సమావేశానికి భవనాలు వెతుక్కోవాల్సిన పరిస్థితి

వికారాబాద్: జెడ్పీ భవన నిర్మాణ పనులు నత్తను తలదన్నేలా సాగుతున్నాయి. ఏడాది క్రితం పనులు ప్రారంభమైనా నేటికీ పునాదుల దశ వీడడం లేదు. వికారాబాద్. కొత్త జిల్లాగా ఏర్పాటు కావడంతో 2019లో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా పరిషత్ నూతన జనరల్ బాడీ ఏర్పాటయ్యింది. పాలకవర్గం కొలువుదీరి నాలుగేళ్లు కావస్తున్నా ఇంకా సొంత గూటికి నోచుకోలేదు. మండల పరిషత్ కార్యాలయంలోనే జెడ్పీ సేవలు నిర్వహిస్తున్నారు. ప్రతి మూడు నెలల కోసారి నిర్వహించే జనరల్ బాడీ సమావేశం కోసం మరో భవనం వెతుక్కోవాల్సి వస్తోంది.

నిధుల మంజూరులో జాప్యం

ఏడాది క్రితం జెడ్పీ భవన నిర్మాణ పనులు ఆర్భాటంగా ప్రారంభమైనా అధికారుల నిర్లక్ష్యం వల్ల పనుల్లో పురోగతి కనిపించలేదు. అంతేకాకుండా నిధులు తేవడంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఏడాది జెడ్పీ నిధులు రూ. 5.15 కోట్లు వెచ్చించి సొంత భవనం సమకూర్చుకోవాలని పాలకవర్గం నిర్ణయించింది. మరిన్ని నిధులు అవసరమైతే పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి, జిల్లా మంత్రి సబితారెడ్డి అండగా నిలుస్తారని భావించారు. అదనపు నిధుల మాట అటుంచితే జెడ్పీ నుంచి కేటాయించిన నిధులను కూడా సకాలంలో వినియోగించలేక పోయారు. ఏడాదిగా పునాదులు దాటి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. అయితే జెడ్పీ నుంచి కేటాయించిన నిధులు రూ. 5.15 కోట్లు సరిపోవని అదనంగా మరో రూ. 5 కోట్లు మంజూరు చేయాలని ఇంజనీరింగ్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అప్పట్లో ప్రభుత్వం 50శాతం నిధులు మంజూరు చేసి 18 నెలల్లో భవన నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించింది. ఏడాది గడువు పూర్తయినా పిల్లర్ స్థాయిలోనే పనులు ఉండడంతో మిగిలిన 50 నిధులు ఇప్పట్లో విడుదలయ్యే అవకాశం కనిపించడం లేదు. దీంతో ఇంజనీరింగ్ అధికారుల అలసత్వంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాప్రతినిధులు విఫలం

జెడ్పీ భవన నిర్మాణానికి అవసరమైన అదనపు నిధులు రాబట్టడంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు భవన నిర్మాణ ప్రారంభ సమయంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావ్ పలు హామీలు ఇచ్చారు. ఏడాది దాటినా ఇందులో ఏ ఒక్క హామీ కూడా నెరవేరలేదు.

“పనుల్లో వేగం పెరిగేలా చూస్తాం



జిల్లా పరిషత్ భవన నిర్మాణ పనులు ప్రారంభించి ఏడాది దాటిన విషయం వాస్తవమే. కాంట్రాక్టర్ సకాలంలో పనులు పూర్తి చేయలేదు. ప్రభుత్వం ఇచ్చిన 18 నెలల గడువులో ఆరు నెలలే మిగిలింది. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు వేగవంతం అయ్యేలా చూస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ ఈఈ, వికారాబాద్

క్లుప్తంగా

చెల్లెలి వద్దకు వెళ్లి వస్తూ అనంత లోకాలకు..



బైకును ఢీకొన్న టాటాఏస్



చరణ్ (ఫైల్)

కుల్కచర్ల: చెల్లెలి క్షేమ సమాచారం తెలుసుకునేందుకు వెళ్లిన సోదరుడు తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఈ ఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటు చేసుకుంది. అల్లాపూర్ గ్రామానికి చెందిన అశోక్ తన కుమారుడు చరణ్‌తో కలిసి బండవెల్కిచర్ల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న కూతురు సంధ్య యోగ క్షేమాలు తెలుసుకునేందుకు సోమవారం పాఠశాలకు వెళ్లారు. వారి తిరుగు ప్రయాణంలో బండవెలిcచర్ల ప్రాథమిక పాఠశాల ఎదుట టాటాఏస్ వాహనం వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో చరణ్ అక్కడికక్కడే మృతి చెందగా తండ్రి అశోక్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం నగరానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీశైలం తెలిపారు.

గొర్రెల మందపై వీధి కుక్కల దాడి

మంచాల: గొర్రెల మందపై వీధి కుక్కల దాడి చేయడంతో ఎనిమిది గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండల పరిధిలోని తాళ్లపల్లిగూడలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గొర్రెల పెంపకంపైనే ఆధారపడి జీవిస్తున్న పాక యాదయ్య ఒకే సారి ఎనిమిది జీవాలు మృత్యువాత పడడంతో బోరున విలపించాడు. బాధితుడికి రూ.లక్ష నష్టం వాటిల్లిందని ప్రభుత్వమే ఆదుకోవాలని అఖిల భారత యాదవ మహాసభ మండల అధ్యక్షుడు గజ్జి ఐలయ్య గొర్రెల కాపరులు, డిమాండ్ చేశారు.

నిబంధనలను పాటించకుంటే జైలు

శంషాబాద్: మద్యం తాగి వాహనం నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఇతరత్రా ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన 38 మందిని ఆర్‌జీఐఏ ట్రాఫిక్ పోలీసులు రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ కోర్టులో సోమవారం హాజరు పర్చారు. వీరిలో 11 మందికి కనిష్టంగా ఒకరోజు, గరిష్టంగా ఐదు రోజుల జైలుశిక్షను న్యాయమూర్తి విధించారు. మిగిలిన వారికి కూడా జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.

కండక్టర్ బలవన్మరణం



ప్రభాకర్ (ఫైల్)

చేవెళ్ల: అనారోగ్య సమస్యలు భరించలేక ఓ ఆర్టీసీ కండక్టర్ పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలూరులో సోమవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి ప్రభాకర్(39) ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన కొన్ని రోజులుగా కడుపునొప్పి తదితర అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఉద్యోగానికి కూడా వెళ్లడం లేదు. ఆయన భార్య నవనీత తన పిల్లలతో సహా పుట్టింట్లోనే ఉంటోంది. ఈ నెల 23న ప్రభాకర్ భార్యాపిల్లలను చూసి మధ్యాహ్నం స్వగ్రామానికి వచ్చాడు. సోమవారం ఉదయం పురుగు మందు సేవించి వచ్చి ఇంటి ఎదుట పడిపోవడంతో స్థానికులు గమనించి చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాత పంటలు కనుమరుగు

పుష్కలమైన జలవనరులు, సాగుకు అనుగునమైన వాతావరణం ఉన్నప్పటికీ రైతులు పాతకాలం పంటల సాగుకు దూరమయ్యారు. ఆరోగ్యానికి అవసరమయ్యే పోషకహారాలను ఇచ్చే పంటల స్థలాన్ని నేడు రసాయన పంటలు ఆక్రమించాయి.

- సంప్రదాయ సాగుకు దూరమైన రైతులు
- కాలానుగుణంగా మారుతోన్న ఆహారపు అలవాట్లు
- తగ్గుతున్న జీవన ప్రమాణాలు



కొర్రపంట

బొంరాస్‌పేట: పాత పంటలే పరమౌషధాలు. సజ్జ, ఉలువ రొట్టెలు, తైదఅంబలి.. సామలు, కొర్రలు వాననొద్ల అన్నం.. ఇలాంటి ఆహారపు అలవాట్లను గురించి చెప్పే వారుంటే వినడానికి రెండు చెవులు చాలవు. గుటకలు మింగేందుకు లాలాజలం సరిపోదు. అలాంటి ఆహారం తీసుకున్నావరి శారీరక దారుఢ్యం, కండ పుష్టితో నిండు నూరేళ్లు జీవించారంటే అతిశయోక్తికాదు. ఇటువంటి పంటలు సాగు చేసిన అన్నదాతలు ఆరోగ్యదాతలయ్యారు.

ఆరోగ్యం కన్నా..

మారుతున్న కాలంతోపాటు మనిషి అలవాట్లు మారిపోతున్నాయి. ఆరోగ్యం కన్నా అందంగా ఉండే ఆహారపదార్థాలనే ఇష్టపడుతున్నారు. పాతకాలపు ఆహారపు అలవాట్లను చూసి ఎద్దేవా చేసే వారు లేకపోలేరు. ఆనాటి పెద్దలకు మాత్రం వారిపట్ల జాలేస్తుందంటున్నారు.

విద్యార్థులకు రాగిజావ

మధ్యాహ్న భోజన పథకంలో ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం రాగి జావ పెట్టాలని నిర్ణయించింది. అల్పాహారంలో తైద అంబలి(రాగి జావ) ఇవ్వడం ప్రవేశపెట్టింది. మధ్యాహ్న భోజన పథకంలో పండ్లు, గుడ్డు, పప్పు,, ఇలా పోషకాహారాన్ని విద్యార్థులకు అందజేసేందుకు ఈ పథకాన్ని అమలు చేయగా పాతపంటల్లో పోషకాహాన్ని పసిగట్టి రాగిజావను అందిస్తోంది. జొన్న, సజ్జ రొట్టెలు, కొర్ర, సామలతో కూడిన అన్నం అందించేందుకు అవకాశం రావచ్చు. కానీ వాటిని పండించే రైతులు లేరు, పంటల పొలాలు కనిపించడం లేదు.

వ్యవసాయంలో ఇప్పటికీ సాంప్రదాయ పద్ధతులున్నాయి. కానీ ఆహారపు అలవాట్లు పూర్తిగా మారిపోయాయి. బలమైన ఆహారాన్ని వదులుకుని రోగాల తెచ్చే మందులు వాడుతునన ఆహారాన్ని శరీరానికిస్తున్నారు. దీనింతో మనిషి సగటు జీవన ప్రమాణ ఆయుష్షు తరిగిపోతోంది. ఆనాటి ఆహారపు అలవాట్లను వీడలేని వారు పాతకాలం నాటి పంటలను అక్కడక్కడ సాగు చేస్తూనే ఉన్నారు. సజ్జలు, సామలు, కొర్రలు, తైదలు(రాగులు), ఉలువలు, నల్లవడ్లు మొదలగు ఆహార ధాన్యాలను నూటికో.. కోటికో అన్నట్లు పొలాల్లో కనిపిస్తున్నాయి. వీటిని రైతులు ఉద్యమ రూపంలో సాగు చేస్తే తప్పా ఆరోగ్యం అందడం కష్టసాధ్యమే.

ప్రోత్సాహం అందుకోవాలి

పాత పంటలసాగులో వ్యవసాయశాఖ అందిస్తున్న సలహాలు, సూచనలు తీసుకోవాలి. రైతులు ఉద్యమంలా వీటి సాగుకు సన్నద్ధమవ్వాలి. తద్వారా అన్నదాతులు ఆరోగ్యతాలవుతారు.

– జి.హేమ, ఏఈఓ, రేగడిమైలారం క్లస్టర్

పోడు హక్కులు కల్పించండి

- పల్లెచెల్కతండా గిరిజనుల ఆందోళన
- తహసీల్దార్, జెడ్పీటీసీ సభ్యులకు వినతిపత్రాల అందజేత

కడ్తాల్: వందల ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూములను హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ పల్లెచెల్కతండా గిరిజనులు ఆందోళన చేపట్టారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ వినోద్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్ నాయక్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ మేరకు సోమవారం వారు మండల కేంద్రంలోని శ్రీశైలం–హైదరాబాద్ రహదారిపై ర్యాలీ చేపట్టి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తండాకు చెందిన 300 కుటుంబాల వారు మూడు తరాలుగా తండా సమీపంలో 1100 ఎకరాల అటవీ మాసుర భూమిలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని సాగు చేస్తున్నామనన్నారు. ఇటీవల అటవీ శాఖ అధికారులు ఇళ్లను ఏర్పాటు చేసుకోకుండా.. సాగును సైతం అడ్డుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను సైతం నిర్మించకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోడు భూములపై హక్కులు కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తమ భూములకు కల్పించా లని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన మ రింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో సర్పంచ్ లోకేశ్‌నాయక్, నాయకులు నవీన్, బీచ్యానాయక్, శ్రీను, మధు,శ్రీను, బాలునాయక్, భీమ్లానాయక్, మోతీలాల్, బాలు, దశరథ, పెద్ద ఎత్తున గిరిజనలు, తండా వాసులు పాల్గొన్నారు.



జాతీయ రహదారిపై బైఠాయించిన పల్లెచెల్కతండా వాసులు

పార్టీ సభ్యత్వం లేకుండా సర్వేలా..?



విలేకరులతో మాట్లాడుతున్న రమేశ్ మహరాజ్, నాయకులు

- ప్రజలను అయోమయానికి గురిచేయొద్దు
- తాండూరు టికెట్ నాదే.. గెలుపు నాదే
- ఏఐసీసీ సభ్యుడు రమేశ్ మహరాజ్

తాండూరు: కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం లేని వ్యక్తులు పార్టీ పేరిట సర్వేలు చేయించుకోవడం సరికాదని ఏఐసీసీ సభ్యుడు రమేశ్ మహరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన సిండికేట్ భవనంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందదర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాండూరు అసెంబ్లీ టికెట్ తనకు కేటాయించినా అనారోగ్యం కారణంగా రోహిత్‌రెడ్డికి టికెట్ ఇప్పించానన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి ఆధిపత్య పోరు నడుస్తోందన్నారు. పట్నం మహేందర్‌రెడ్డి క్రిమినల్ మైండ్‌తో గతంలో ప్రశాంత్ కిశోర్ వద్ద పనిచేసిన వ్యక్తితో కాంగ్రెస్ పార్టీ నుంచి తాండూరు అసెంబ్లీ నుంచి మహేందర్ రెడ్డి తన భార్యను ఎంపీగా అభ్యర్థులుగా జాబితా సిద్ధం చేసి సర్వే చేయించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్నం మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరితే స్వాగతిస్తామని పార్టీ టికెట్ మాత్రం తనకే కేటాయిస్తుందన్నారు. తన గెలుపునకు పనిచేయాలని ఇటువంటి సర్వేలతో ప్రజలను అయోమయానికి గురిచేయొద్దని సూచించారు. ప్రజాసేవ గురించి మహరాజుల కుటుంబానికి తెలిసినంత ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిలకు తెలియదన్నారు. ఇద్దరు నేతలు స్వార్థ రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుతున్నారన్నారు. తాండూరు ప్రజలు ఒక్క అవకాశం ఇస్తే ప్రజాసేవ అంటే ఏమిటో చూపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దేముల్ జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్, నాయకులు జనార్దన్‌రెడ్డి, వడ్ల నర్సింహులు తదితరులున్నారు.

వర్షాలకు స్తంభించిన రవాణా



కాగ్నా నది దాటకుండా కంచె ఏర్పాటు చేసి కాపలా కాస్తున్న గ్రామ సేవకులు



డైవర్షన్ రోడ్డుపై ప్రవహిస్తున్న వరద

- ఉధృతంగా ప్రవహిస్తున్న 'కాగ్నా'
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న జనం



ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు

ధారూరు: ఎడతెరిపి లేని వర్షాలతో పొంగిపొర్లుతున్న వాగులు వంకలు రవాణాను పూర్తిగా స్తంభింప జేస్తున్నాయి. గ్రామాలు, పట్టణాలకు బంధాలు నిలిపి వేస్తున్నాయి. దోర్నాల్ నుంచి ధారూరు వెళ్లే మార్గంలో ఉన్న కాగ్నా నదిని దాటేందుకు యత్నించిన పలువురు వరద ఉధృతికి భయపడి వెనుదిరిగారు. దోర్నాల్–స్టేషన్‌ధారూరు గ్రామాల మధ్య ప్రవహిస్తున్న కాగ్నా నదిని దాటేందుకు ఏడాది క్రితం ఆరుగురు ప్రయత్నించగా.. అందులో ఒకరు వరద ఉధృతికి కొట్టుకుపోయి మృతి చెందిన విషయం విదితమే. ఇలాంటి ప్రమాదాల్లో పలుమార్లు రైతులు పశు సంపదను కోల్పోయారు. ఇందుకు కారణం కాగ్నా నదిపై కొత్తగా నిర్మిస్తున్న వంతెన పనులు నిలిచిపోవడం.. పక్కనున్న డైవర్షన్ రోడ్డు నీటి ప్రవాహంలో మునిగిపోవడమే.

ప్రతీ ఏడాది ఇదే తంతు

గతేడాది ఇదే సీజన్‌లో మూడు నెలల పాటు రాకపోకలను స్తంభింపజేసిన కాగ్నా.. ఈ సారి ఎన్ని నెలలు అడ్డుకుంటుందోనని పరిసర ప్రాంత ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. నదీ ప్రవాహం వలన ధారూరుకు వెళ్లాలంటే 30కి.మీ. మేర దూరభారం పెరుగుతోందని విచారం వ్యక్తం చేశారు. వానలు మరింత జోరుగా కురిస్తే.. పై భాగంలో ఉన్న సర్పన్‌పల్లి, లక్నాపూర్ ప్రాజెక్టులు నిండి.. అలుగు ద్వారా నీరు కాగ్నా నదిలో కలిసి ప్రవహిస్తే డైవర్షన్ రోడ్డుపై నుంచి రాకపోకలు పునరుద్ధరించడం సాధ్యం కాదంటున్నారు.

ఇరవైపులా కంచె

ఈనెల 20 నుంచి నది వైపు ఎవరూ వెళ్లకుండా.. ఇరువైపులా కంచె ఏర్పాటు చేశారు. రాకపోకలను నిలిపివేసినట్లు ప్రకటించారు. ధారూరు నుంచి కేవలం 6 కిలో మీటర్లు వెళితే గమ్యాన్ని చేరుకుంటామని, డైవర్షన్ రోడ్డు దెబ్బతినడం వలన ఐదు రెట్లు అధికంగా తిరగాల్సి వస్తోందని దోర్నాల్, అంపల్లి, గురదొట్ల, పీసీఎం తండా, దోర్నాల్ తండా పరిసర ప్రాంత ప్రజలు వాపోయారు. దూరభారంతో పాటు ఆర్థికంగా నష్టపోతున్నామని చెప్పారు. మరలా రాకపోకలు ప్రారంభం కావాలంటే ఎన్ని నెలలు పడుతుందోనని విచారం వ్యక్తం చేశారు. అధికారుల, పాలకులు స్పందించి ప్రత్యమ్నాయం చూపాలని కోరుతున్నారు.

కోట్‌పల్లి ప్రాజెక్టుకు భారీ వరద

ధారూరు: మర్పల్లి, బంట్వారం, మోమిన్‌పేట్, కోహీర్ ప్రాంతాల నుంచి వచ్చిన వరద వాగుల ద్వారా కోట్‌పల్లి ప్రాజెక్టులోకి చేరింది. సోమవారం పూర్తిగా నిండిన ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ముందుగానే 8 అడుగుల వరకు ప్రాజెక్టులో నీరుండగా ఐదురోజులుగా కురుస్తున్న వర్షాలకు 24 అడుగులకు చేరింది.

సమస్యల పరిష్కారానికే 'పల్లెబాట'



గ్రామస్తుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌రూరల్: గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించడమే పల్లెబాట కార్యక్రమ లక్ష్యమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పల్లెలు అభివృద్ధి చెందినప్పుడే దేశం ప్రగతి సాధిస్తుందన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఖాజాఇద్రీస్‌అహ్మద్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, ఎంపీటీసీ సభ్యుల సంఘం మండల అధ్యక్షుడు భీష్వ రామకృష్ణ, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు యాదయ్య, నాయకులు పోచయ్యగౌడ్, జనార్దన్‌గౌడ్, అశోక్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన రాయికల్ టోల్‌ప్లాజా సమీపంలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి(40) మతిస్థిమితం సక్రమంగా లేకపోవడంతో కొంత కాలంగా రాయికల్ టోల్‌ప్లాజా సమీపంలో తిరుగుతున్నాడు. జాతీయ రహదారి ప్రక్కన ఉండే హోటల్స్‌లో ఆహారాన్ని అడుక్కుని తింటూ ప్రక్కనే ఉన్న బస్టాప్‌లో ఉండేవాడు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న ఏఎస్‌ఐ వెంకటేశ్ ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతుడికి వివరాలు తెలియకపోవడంతో శవాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు

అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి సూచించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆయా సమస్యలపై 348 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పవర్ 'కట్'కట!



కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలిస్తున్న సిబ్బంది

- తుర్కయంజాల్‌లో కాలిపోయిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్
- వారం రోజులుగా పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు
- అవస్థలు పడుతున్న వినియోగదారులు

తుర్కయంజాల్: తుర్కయంజాల్ సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి వారం రోజులు గడుస్తున్నా.. బాగు చేయించడంలో విద్యుత్ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సరఫరాలో అంతరాయం కలిగితే గంటల వ్యవధిలోనే పరిష్కారం చూ పాల్సి ఉండగా.. కాలయాపన చేయడంపై వి నియోగదారులు మండిపడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా, గాలి వీచినా గంటల తరబడి కరెంటు నిలిపేస్తున్నారు. నగరానికి కూతవేటు దూరంలో ఉండి, నిర్మాణ రంగం శరవేగంగా ముందుకు సాగుతున్న ప్రాంతంలో విద్యుత్ సమస్యలు తలెత్తడం ఇబ్బందికర ంగా మారుతోంది. కరెంటు సరఫరా ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో..? తెలి యని పరిస్థితి నెలకొందని ప్రజలు చెబుతున్నారు.

ఫిర్యాదు చేసినా..

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు కరువయ్యారు. ఏఈఈ శ్రీనివాస్‌రెడ్డి పాటు సబ్ స్టేషన్లో ఏర్పాటు చేసిన ఫిర్యాదు నంబర్ 9493193132కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల తీరుపై ప్రజలు విసుగెత్తి పోతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

కొత్తది ఏర్పాటు చేస్తాం

వారం రోజుల క్రితం పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన విషయం వాస్తవమే. సోమవారం దీన్ని తొలగించాం. ఈ స్థానంలో మంగళవారం మరో ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తాం. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కరెంటు సరఫరా చేస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ఏఈఈ

గంజాయి ముఠా గుట్టురట్టు

ఇబ్రహీంపట్నం రూరల్: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ముఠా గుట్టు రట్టయింది. ఈ సంఘటన ఆదిబట్ల పీఎస్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రవికుమార్ తెలిపిన ప్రకారం.. బీహార్ రాష్ట్రం సాహ్‌గుంజ్ జిల్లా బడ్కోరి గ్రామానికి చెందిన మహమ్మద్ మిరాజ్ అన్సారీ(27) కొన్నేళ్లుగా ఆదిబట్ల బీరప్ప ఆలయ సమీపంలో రాఘవేంద్ర ఇటుక బట్టీ పరిశ్రమలో కూలీగా పని చేస్తున్నాడు. ఆ యన రెండు నెలల క్రితం బీహార్ నుంచి 8 కేజీల గంజాయి తీసుకువచ్చి సేవిస్తూ.. మరో మైనర్‌తో కలిసి విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు, ఆదిబట్ల పోలీసులు ఆదివారం రాత్రి ఇటుక బట్టీపై దాడి చేసి నిందితుల వద్ద 7కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.1.5లక్షలు ఉంటుందన్నా రు. గంజాయిని చిన్న ప్యాకెట్లుగా చేసి రూ.300 చొ ప్పున విక్రయిస్తూ వీరు సొమ్ము చేసుకు ంటున్నారు. వీరికి బీహార్ నుంచి గంజాయి సరఫరా చేస్తున్న బినయ్ పరారీలో ఉండగా మిరాజ్ అన్సారీ, మైనర్‌ను అరెస్ట్ చేసిన రిమాండ్‌కు తరలించారు. అ నంతరం బాలుడిని జువైనల్ హోంకు అప్పగించారు.

బావమరిదిని చంపిన బావకు జీవిత ఖైదు

రూ.500 జరిమానా



నిందితుడు విశ్వప్రదాన్

ఇబ్రహీంపట్నం రూరల్: బావమరిదిని చంపిన బావకు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా కోర్టు తీర్పు వెల్లడించింది. ఆదిబట్ల సీఐ రవికుమార్ తెలిపిన ప్రకారం.. ఒడిసా రాష్ట్రం బానర్ డివిజన్ కలహండి జిల్లాకు చెందిన సంజుక్త మాఝీ, ఆమె భర్త విశ్వప్రధాన్ మన్నెగూడ సమీపంలోని హరీస్ ప్రణవ్ విల్లాస్‌లో కాంట్రాక్టర్ ప్రభాకర్‌రెడ్డి వద్ద సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగించేవారు. వారితో పాటు సంజుక్త మాఝీ సోదరుడు బానామాఝీ అదే కాంట్రాక్టర్ వద్దే పనిచేసేవాడు. విశ్వప్రధాన్ నిత్యం మద్యం సేవించి సంజుక్త మాఝీతో గొడవపడేవాడు. 2021 అక్టోబర్ 11న దంపతులు ఇద్దరు గొడవపడుతుండగా పక్కగదివారు గమనించి బానామాఝీ చెప్పడంతో అక్కడి చేరకుని బావను నిలదీశాడు. దీంతో కక్ష పెంచుకున్న విశ్వప్రధాన్ రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో బావమరిది తలపై బండరాయి వేశాడు. దీంతో తీవ్రరక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మాకుటుంబ విషయంలో జోక్యం చేసుకున్నందునే హతమార్చినట్లు ఒప్పుకోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు సోమవారం ఎల్బీనగర్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి(ఏడీజే) నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పువెల్లడించారు. విశ్వప్రదాన్ ఇప్పటికే చర్లపల్లి జైలులో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.